# కండ్ల ముందు అభివృద్ధి, ఇంటింటా సంక్షేమం

- సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ సమగ్రాభివృద్ధి
- అందమైన పొదరింట్లోకి రాక్షసులను రానివ్వొద్దు
- కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే మరో 20 ఎండ్లు వెనక్కి
- బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- యూఎస్ఏ బీఆర్ఎస్ అధ్యక్షుడు తన్నీరు మహేశ్‌రావు

చేర్యాల, నవంబర్ 23 : తెలంగాణలో కండ్ల ముందు అభివృద్ధి, ఇంటింటా సంక్షేమ ఫలాలు అందుతున్న తరుణంలో సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలువాల్సిన సమయం ఆసన్నమైందని యూఎస్ఏ బీఆర్ఎస్ సెల్ అధ్యక్షుడు తన్నీరు మహేశ్‌రావు, ఎన్ఆర్ఐలు జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవా రమేశ్, కిశోర్ లింగారెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ బృందం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూర్, మహబూబాబాద్, జనగామ, చేర్యాల ప్రాంతాల్లో తాము పర్యటించామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని, వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి కాల్వల ద్వారా చెరువులకు గోదావరి జలాలను పంపింగ్ చేశారని తెలిపారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి రికార్డు స్థాయిలో పంటలు పండడంతో తెలంగాణ అన్నపూర్ణగా మారిందన్నారు. ఒకప్పుడు చేర్యాల, జనగామ కరువు ప్రాంతాలని, ఇప్పుడు సీఎం కేసీఆర్ పాలనలో బంగారు పంటలు పండుతున్నాయని తెలిపారు. సాగు, తాగునీటి కష్టాలు తీరిపోయాయన్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయమన్నారు. విద్యావంతుడైన జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, మిల్క్ బేస్డ్ యూనిట్స్ ఏర్పాటవుతాయన్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాను రేబర్తి గ్రామానికి చెందిన వ్యక్తినని, బీఆర్ఎస్ హయాంలో జనగామ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. చేర్యాల, జనగామ ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి పల్లాను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు చేసే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ అనే అందమైన పొదరిల్లును నిర్మించారని, అందులోకి కాంగ్రెస్ రాక్షసులను రానివ్వకుండా చూడాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరో 20 ఏండ్లు తెలంగాణ వెనక్కిపోతుందన్నారు. చేర్యాల, జనగామ ప్రాంతాలతో సీఎం కేసీఆర్‌కు ఎంతో అనుబంధం ఉందని, ఈ ప్రాంతాన్ని బంగారు తునకగా చేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజలు తప్పకుండా బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. గణేశ్, కిశోర్, రవి మాట్లాడుతూ తెలంగాణలో సోషల్ మీడియాతోపాటు కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది సరికాదన్నారు. ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమం రెండుకండ్లుగా కేసీఆర్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని, పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలో నంబర్ వన్ స్థాయికి చేరిందన్నారు. ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదన్నారు.

తెలంగాణ రాకముందు తమ పేరెంట్స్ కండ్లలో కన్నీళ్లు చూశామని, ఇప్పుడు ఆనందం చూస్తున్నామని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రజలు మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ సర్కారుతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు మరోసారి అధికారంలోకి రాబోతున్నదని తెలిపారు. సమావేశంలో చేర్యాల ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, ప్రచార కార్యదర్శి శనిగరం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ బృందం ప్రతినిధులు


రాజలింగాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రాజలింగానికి చేదు అనుభవం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 23 : ధూళిమిట్ట మండలం తోర్నాల గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగానికి చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా తోర్నాల గ్రామానికి వచ్చిన రాజలింగం బీఆర్ఎస్ నాయకుల దగ్గరకు వెళ్లి పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కోపోద్రిక్తులైన బీఆర్ఎస్ నాయకులు నిన్నమొన్నటి దాకా బీఆర్ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌లోకి వెళ్లగానే బీఆర్ఎస్‌ను విమర్శించడమేంటని ఆయనను నిలదీశారు. ఈ ప్రాంతానికి రాజలింగం ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లాలని బీఆర్ఎస్ పట్టుబట్టారు. దీంతో రాజలింగం గన్‌మెన్ వచ్చి అతడిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు తాళ్లపల్లి భిక్షపతి మాట్లాడుతూ నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న రాజలింగం... పార్టీ మారగానే ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తోర్నాల బ్రిడ్జిని తానే కట్టించానని రాజలింగం గొప్పలు చెప్పుకుంటున్నారని, పొన్నాల లక్ష్మయ్య హయాంలో బ్రిడ్జి నిర్మాణమైందని గుర్తుచేశారు.

## పీఎస్‌ను సందర్శించిన సీపీ

కొమురవెల్లి, నవంబర్ 23 : కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సందర్శించారు. ఈ సందర్భంగా ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేరాస్తుల బైండోవర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు గురించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు


చేర్యాల : బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కండువా కప్పుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


కొమురవెల్లి : పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సీపీఎం నాయకులు

చేర్యాల, నవంబర్ 23 : మండలంలోని నాగపురి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్ సంతోషీకరుణాకర్ ఆధ్వర్యంలో జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో నాగపురి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడాల సురేశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీను, మహేందర్, బీజేపీ వార్డు సభ్యుడు చిరుమల్ల కిష్టమ్మ, నాయకులు చంద్రశేఖర్‌చారి, దేవలపల్లి స్వరూప, తలారీ నారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లేశం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భీమరాజు, యూత్ అధ్యక్షుడు స్వామి, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన సీపీఎం నాయకులు

కొమురవెల్లి, నవంబర్ 23 : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లిలో సీపీఎంకు పెద్ద షాక్ తగిలింది. సీపీఎం గ్రామ అధ్యక్షుడు చిన్నల్లో కనకయ్య, గ్రామ కార్యదర్శి కంకనాల నర్సింహులతోపాటు 14 మంది సీపీఎం నాయకులు గురువారం జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోశవ్వ, మాజీ సర్పంచ్ భిక్షపతి, బీఆర్ఎస్ యూత్ మాజీ మండలాధ్యక్షుడు కనకరాజు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ నాగమల్ల సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు రమేశ్, నర్సయ్య పంతులు, గురువయ్యగౌడ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే చేర్యాల అభివృద్ధి

చేర్యాల, నవంబర్ 23 : బీఆర్ఎస్‌తోనే చేర్యాల మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇన్‌చార్జి శివగారి అంజయ్య అన్నారు. గురువారం పట్టణంలోని వివిధ వార్డుల్లో అంజయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల సోమయ్య, ఉపేందర్, శ్రీనివాస్, గణేశ్, గుడ్ల బాబు, బాలరాజు, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.


చేర్యాలలో ప్రచారం చేస్తున్న అంజయ్య తదితరులు

## ‘కొమ్మూరి’ని అడ్డుకున్న గిరిజనులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 23: ధూళిమిట్ట మండలం దుబ్బతండాలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని తండావాసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ తండాకు కొమ్మూరి చేసిన అభివృద్ధి శూన్యమని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండాలోకి వచ్చే అర్హత ప్రతాప్‌రెడ్డికి లేదని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని తండావాసులు నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు తండావాసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చేసేదేమీలేక కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని మధ్యలో నిలిపివేసి వెనుదిరిగారు. మరోవైపు హనుమతండాలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పలువురు యువకులు నిరసన తెలిపారు.

## నేడు మద్దూరు మండలంలో ‘పల్లా’ ప్రచారం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 23 : మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో నేడు జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు లద్నూర్, 9.30 గంటలకు మర్మాముల, 10.30 గంటలకు ధర్మారం, మధ్యాహ్నం 12 గంటలకు సలాఖపూర్, 3 గంటలకు వంగపల్లి, సాయంత్రం 4 గంటలకు రేబర్తి, 5 గంటలకు వల్లంపట్ల, 7 గంటలకు గాగిళ్లాపూర్ గ్రామాల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

చేర్యాల, నవంబర్ 23 : మండంలోని కాశేగుడిసెల గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ షేక్ ఫకీర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు షేక్‌కమల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాశేగుడిసెలను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిందని, దీంతో గ్రామం అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మరోవైపు మండలంలోని వేచరేణిలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.


చేర్యాల : కాశేగుడిసెలలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఫకీర్ తదితరులు


చేర్యాల : వేచరేణిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు